ప్రజాశక్తి
ఆదివారం 3 ఆగస్టు 2025 5 విజయనగరం



కొత్తగా 122 పోలింగ్ కేంద్రాలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌లో భాగంగా జిల్లాలో కొత్తగా 122 కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించామని డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాసమూర్తి చెప్పారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే చెప్పాలని రాజకీయ పార్టీలను కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో శనివారం సమావేశం జరిగింది. శిథిలావస్థలో ఉన్న భవనాలకు బదులుగా స్థానాల మార్పు కోసం 23, పేర్ల మార్పు కోసం 51 పోలింగ్ కేంద్రాల జాబితాను రూపొందించినట్లు ఆయన తెలిపారు. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు తరువాత జిల్లాలో ఈ సంఖ్య 1969కు పెరుగుతుందని తెలిపారు. బిఎల్‌ఎల నియామకానికి పార్టీలన్నీ సహకరించాలని, జాబితాలను పంపించాలని కోరారు. ఈ సమావేశంలో ఇఆర్‌ఒలు ప్రమీలా గాంధీ, కళావతి, ఆశయ్య, సూకరాజు, ఎఇఆర్‌ఒలు, ఎన్నికల డిటిలు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాస్కరరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు కుటుంబరావు, బందారు ఆనంద్, సోములు, ఎస్.శ్రీనివాసరావు, సిహెచ్ అప్పారావు, ఆర్.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సంపూర్ణ సహకారం

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత
- 2.27 లక్షల మంది రైతులకు అన్నదాతా సుఖీభవ విడుదల

రైతులతో కలిసి నాట్లు వేస్తున్న మంత్రి అనిత

ప్రజాశక్తి-గజపతినగరంరూరల్

విత్తనం నాటిన దగ్గర నుంచి పంట కోసి ఇంటికి చేర్చేవరకు రైతుకు అన్ని విధాలా ప్రభుత్వ పరంగా సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు మంచి రోజులు వచ్చాయని చెప్పారు. గజపతినగరం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం నిర్వహించిన అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ విడుదల కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని, రైతులకు చెక్కులు పంపిణీ చేశారు. ముందుగా ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్న కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించారు. వ్యవసాయ, అనుబంధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శించారు. అనంతరం మంత్రి అనిత రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ సూపర్ సిక్స్‌లో భాగంగా అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్‌ను విడుదల చేస్తున్నట్లు చెప్పారు. రీసర్వేలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో ఒక ప్రత్యేక సెల్‌ను, టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు మంత్రి సూచించారు. కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకంలో జిల్లాలో 2,27,700 మంది రైతులకు రూ.152.45 కోట్లను అందిస్తున్నట్లు చెప్పారు. సాంకేతిక కారణాలతో ఎవరికైనా అందకపోతే, గ్రామంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. తల్లికి వందనం పథకం కింద కొంతమంది తల్లులకు సాంకేతిక కారణాలతో డబ్బులు పడలేదని, రెండు వారాల్లో ఈ సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందని చెప్పారు. అనంతరం మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ మాట్లాడారు. ఈ సందర్భంగా పొలంలో రైతులతో కలిసి మంత్రి అనిత నాట్లు వేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి విటి రామారావు, గజపతినగరం ఎఎంసి చైర్మన్ పివి గోపాలరాజు, మార్కెటింగ్ శాఖ ఎడి రవికిరణ్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఎన్.వెంకటేష్, ప్రత్యేక ఉప కలెక్టర్ ప్రమీల గాంధీ, ఆర్‌డిఒ మోహనరావు, కూటమి పార్టీల నాయకులు కొండపల్లి కొండలరావు, రెడ్డి పావని, మర్రాపు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై గళమెత్తిన గురువులు

కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయులు గళమెత్తారు. ఫ్యాప్టో ఆధ్వర్యాన జిల్లా కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా చేపట్టారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ పి.శ్రీనివాస్ అధ్యక్షతన చేపట్టిన ధర్నాలో భారీగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ బదిలీలు జరిగి 45 రోజులు గడిచినా ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. వెంటనే జీతాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పి-4 కార్యక్రమాన్ని ఉపాధ్యాయులతో నిర్బంధంగా అమలు చేయిస్తున్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు లేకుండా చేయాలని కోరారు. కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షనరీ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని, ఉద్యోగులకు అన్ని రకాల బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్‌చేశారు. పెండింగ్‌లో ఉన్న డిఎలను ప్రకటించాలని, 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించి, ఐఆర్‌ను ప్రకటించాలని కోరారు. 2003 డిఎస్‌సి వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాలను కొనసాగించాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల జిపిఎఫ్ సమస్యను పరిష్కరించాలని కోరారు. సూపర్ న్యూమరి పోస్టులను సృష్టించి పండిట్లకు, వ్యాయామ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. ఇహెచ్‌ఎస్ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చకుంటే చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా నాయకులు జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, డి.శ్యామ్, రమణ, జోగారావు, రమేష్‌చంద్ర పట్నాయక్, విజయగౌరి, రెడ్డి మోహన్‌రావు, సదాశివరావు, సన్యాసిరాజు, భాస్కరరావు, డి.రాము, అప్పారావు, గోవిందరావు, శ్రీనివాస దొర, సూరిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రతి ఒక్కరిలో దేశ భక్తిని పెంపొందించేలా శనివారం నుంచి ఈ నెల 15 వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాల నోడల్ అధికారిగా జిల్లా పర్యాటక శాఖాధికారి కుమారస్వామిని నియమించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమాలు మూడు దశల్లో జరుగుతాయని తెలిపారు. ఈ నెల 2 నుంచి 8 వరకు పాఠశాల, అన్ని విద్యాసంస్థల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భవనాలను అలంకరించడం, విద్యార్థులకు తిరంగా రంగోలి, తిరంగా రాఖీ మేకింగ్ వర్క్‌షాప్స్, తిరంగా వేవ్స్ అండ్ ట్రెడ్స్ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. రెండో దశలో 9 నుంచి 12వ తేదీ వరకు తిరంగా మహోత్సవ్ పేరుతో ప్రజాప్రతినిధులు, విఐపిలు పాల్గొనే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో స్థానిక ఉత్పత్తులతో డ్వాక్రా మహిళలతో తిరంగా కలర్ థీమ్‌తో ప్రత్యేక తిరంగా మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హర్‌ఘర్ తిరంగా సెల్ఫీ బూత్‌లను ఏర్పాటు చేయడం, ఫొటోలను www.harghartiranga.com వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. మూడో స్థాయిలో 13 నుంచి 15వ తేదీ వరకు ప్రభుత్వ భవనాలను, పాఠశాలలను, హోటళ్లను, వంతెనలు, డ్యాములను విద్యుద్దీకరించి, అలంకరించి జాతీయ జెండాలను ఎగుర వేయడానికి సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పాకలు తొలగించడంతో చెట్టుకిందికి చేరిన నిరాశ్రయులు

నిరాశ్రయుల పాకలు తొలగింపు

పిల్లా పాపలతో చెట్టు కిందే ఆవాసం

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరంలోని కోటకు ఆనుకుని నిరాశ్రయులు ఏర్పాటు చేసుకున్న పాకలను శనివారం మాన్సాస్ అధికారులు దౌర్జన్యంగా తొలగించారు. మరోదిక్కు లేక పిల్లా పాపలతో వారంతా చెట్టు కిందే ఆవాసం పొందుతున్నారు.

నగరంలోని కోటకు దక్షిణ భాగాన ఉన్న ఖాళీ స్థలంలో సుమారు 15 కుటుంబాలు పాకలు ఏర్పాటు చేసుకుని, నెలల తరబడి నివాసం ఉంటున్నాయి. శనివారం మాన్సాస్ అధికారులు పోలీసులను వెంటబెట్టుకుని, జెసిబితో అక్కడికి చేరుకున్నారు. వారిని అక్కడి నుంచి ఖాళీ చేయాలని చెప్పారు. తమకు స్థలాలు ఇప్పిస్తే ఇక్కడి నుంచి ఖాళీ చేస్తామని నిరాశ్రయులంతా పట్టుబట్టారు. అయినా పట్టించుకోకుండా జెసిబితో మాన్సాస్ సిబ్బంది.. వారి పాకలను తొలగించారు. దీంతో నిరాశ్రయులంతా అక్కడే ఉన్న మర్రి చెట్టు కిందికి పిల్లా పాపలు, సామాన్లతో చేరుకున్నారు. తమకు స్థలాలు ఇప్పించే వరకూ ఇక్కడే ఉంటామని స్పష్టంచేశారు.

బిఎస్ఎన్ఎల్ ఫ్రీడమ్‌ప్లాన్

రూపాయికే అన్‌లిమిటెడ్ కాల్స్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బిఎస్ఎన్ఎల్ సరికొత్త ఫ్రీడం ప్లాన్ తీసుకొచ్చిందని, కేవలం రూ.1తో 30 రోజుల వ్యాలిడిటితో అపరిమిత కాలింగ్, రోజుకు 2 జిబి డేటా, 100 ఎస్ఎంఎస్‌లు పొందవచ్చని విజయనగరం ఆపరేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ దాలినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సిమ్ కార్డు కావాల్సిన వారు సమీపంలోని బిఎస్ఎన్ఎల్ సేవా కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

ధర్నాల్లో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, నాయకులు, ప్రజలు

స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాల్సిందే

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-శృంగవరపు కోట

విద్యుత్ ఛార్జీల నిలువు దోపిడీని ఆపాలని, ప్రమాదకరమైన స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్తు ఛార్జీల భారాలపై, స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలని సిపిఎం ఆధ్వర్యాన శనివారం శృంగవరపుకోట పట్టణంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం కరెంటు ఛార్జీలు పెంచి రూ.32 వేల కోట్లు భారం వేసిందని, టిడిపి కూటమి అధికారంలోకి వస్తే ఇక బాదుడు ఉండదని చెప్పారని గుర్తుచేశారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక 2022 నుంచి 2024 వరకు కట్టిన బిల్లులకు మళ్లీ ట్రూ అప్ ఛార్జీల పేరిట ప్రజలపై భారం మోపిందని దుయ్యబట్టారు. పాత మీటర్లు తొలగించి స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ద్వారా అదానీకి లాభం చేకూర్చేందుకు చూస్తోందని విమర్శించారు. వీటిపై ఈ నెల ఐదో తేదిన విద్యుత్ కార్యాలయాల వద్ద చేపట్టే ఆందోళనలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గాడు అప్పారావు, మద్దిల రమణ, చల్లా జగన్, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లు రద్దు చేస్తామని చెప్పి మాట తప్పిందని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు విమర్శించారు. శనివారం నగరంలోని గాజులరేగ సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ అదానీ స్మార్ట్ మీటర్లు బిగించేందుకు వస్తున్నారని, మీ ఇంటికి వస్తే అడ్డుకొని తిప్పికొట్టాలని కోరారు. టిడిపి కూటమి నేతలు ఎన్నికల ముందు ఒక మాట, అధికారం వచ్చాక మరో మాట చెప్పి వేస్తున్న భారం మోయలేక పోతున్నామన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అంటించారు.

తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, తదితరులు

తల్లిపాల వారోత్సవాలు పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలను అందించాలని, ముర్రుపాలే బిడ్డకు మొదటి టీకా అని కలెక్టర్ బిఆర్.అంబేద్కర్ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. తల్లిపాల వారోత్సవాలు ఈ నెల ఒకటో తేది నుంచి ఏడో తేది వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, డిఎంహెచ్‌ఒ జీవనరాణి, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ దేవి మాధవి, డిఐఒ అచ్యుతవల్లి, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ రాణి, జవహర్ ఆరోగ్య బాల కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, ఐసిడిఎస్ పీడీ టి.విమలారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జిలకు సకాలంలో రుణాలు

బ్యాంకర్లకు మంత్రి శ్రీనివాస్ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరంకోట

స్వయం సహాయక సంఘాలకు అవసరమైన రుణాలను అవసరమైన సమయంలో ఇవ్వాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్.. బ్యాంకర్లను ఆదేశించారు. శనివారం రుణ ప్రణాళిక, మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల రుణాల మంజూరుపై డిఆర్‌డిఎ సమావేశ మందిరంలో పీడీ పి.శ్రీనివాస్ అధ్యక్షతన విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల రుణ మొత్తం రూ.2 లక్షలు దాటితే వారికి అవసరమైన రుణాలు ముద్ర, పిఎంఇజిపి, పిఎంఎఫ్‌ఎంఇ లేదా ఇతర స్కీముల ద్వారా పొందేలా బ్యాంకు మేనేజర్లు సహకరించాలని కోరారు. మహిళల ఆధ్వర్యంలో వ్యాపారాల కోసం రుణాలు తీసుకొన్న వారికి రెండు శాతం ఇంటర్ సబ్ వెన్షన్ కూడా వర్తిస్తుందని చెప్పారు. సిజిటిఎంఎస్‌ఇ స్కీమ్ కింద గ్యారంటీ ఫీజు చెల్లిస్తే ఆ రుణ మొత్తానికి రక్షణ లభిస్తుందన్నారు. స్త్రీనిధి బ్యాంకు ఎమ్‌డి హరిప్రసాద్, జిల్లా స్థాయి బ్యాంకర్స్ కమిటీ కన్వీనర్ కె.శ్రీనివాస్, డిఆర్‌డిఎ మన్యం జిల్లా పీడీ సుధారాణి, ఉడిపిఎంలు, ఎపిఎంలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు

బాక్సింగ్ పోటీలకు సచిన్, జాహ్నవి ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు బి.సచిన్, ఎం.జాహ్నవి ఎంపికయ్యారు. విశాఖపట్నంలో జరిగిన ఆరో రాష్ట్ర సబ్‌జూనియర్స్ బాయ్స్ అండ్ గర్ల్స్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో సచిన్, జాహ్నవి బంగారు పతాకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ నెల 7 నుండి 14 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నోయిడాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు. వీరిని జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు శనివారం అభినందించారు. కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు గరే శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డోలా మన్మథ కుమార్, జిల్లా కార్యదర్శి ఇందుకూరి అశోక్‌రాజు, ఆర్గనైజర్ సెక్రెటరీ ఎస్‌ఇ రాజు, రాకేష్ కుమార్, మహబూబ్ షరీఫ్, శాప్ కోచ్ బి.ఈశ్వర్, పిఎల్ ప్రసాద్ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న విఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ్ గోపాల్

అభివృద్ధికి సహకారం

విఎంఆర్‌డిఎ చైర్మన్ వెంకట్ ప్రణవ్ గోపాల్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విఎంఆర్‌డిఎ పరిధిలోని అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేసేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామని చైర్మన్ ఎం.వెంకట ప్రణవ్ గోపాల్ తెలిపారు. నగరంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ రూ.44 లక్షలతో పిఎస్‌ఆర్ పార్కు, రూ.35.85 లక్షలతో అయ్యన్నపేట గాంధీ పార్కు, రూ.7.12 కోట్లతో జెఎన్‌టియు రహదారి అభివృద్ధి పనులను చేపట్టనున్నామని వివరించారు. ఎమ్మెల్యే అదితి మాట్లాడుతూ త్వరగా పనులు పూర్తి చేసి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో విఎంఆర్‌డిఎ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి, కార్పొరేటర్ దాసరి సత్యవతి, ఎఎంసి చైర్మన్ కర్రోతు నర్సింగరావు, అధికారులు పాల్గొన్నారు.

పి-4.. నేతి బీరకాయేనా?

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వ, ప్రయివేటు, ప్రజల భాగస్వామ్యం(పి-4) పాలసీతో రాష్ట్రంలో పేదరికం నిర్మూలించవచ్చునని సిఎం చంద్రబాబు నాయుడు ప్రచారం చేస్తున్నారు. అందుకనుగుణంగా విధానం రూపకల్పన చేసి మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు చూడడానికి బాగానే ఉన్నాయి. కానీ వాటిని ఆచరణలో పెట్టడానికి అధికారులు, ఉద్యోగులకు శిరోభారంలా మారుతోంది. ప్రభుత్వాలు గత కొంతకాలంగా ఇబ్బడిముబ్బడిగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికీ నిర్మూలన కాని పేదరికం పి-4 విధానంతో ఎలా మాయమవుతుందనే చర్చ మొదలైంది. గత పదేళ్లుగా ప్రభుత్వాలు సంక్షేమ పథకాల పేరుతో నేరుగా పేదల ఖాతాల్లోకి లక్షల కోట్ల రూపాయలు బదిలీ చేశాయి. వైసిపి ప్రభుత్వం నవరత్నాల పేరిట ఐదేళ్ల లో సుమారు రెండున్నర లక్షల కోట్ల రూపాయల మేర పేదలకు పంపిణీ చేసింది. ఏడాదిన్నర క్రితం జరిగిన ఎన్నికల్లో టిడిపి కూటమి పార్టీలు వైసిపిని మించిన హామీ లిచ్చి అధికారంలోకి వచ్చాయి. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో టిడిపి ప్రభుత్వం కూడా సూపర్ సిక్స్ హామీల అమలు కోసం ఒక్కో అడుగు ముందుకు వేస్తోంది. ఈ పథకాల కింద ప్రభుత్వం పేదలకు నేరుగా డబ్బులు పంపిణీ చేస్తోంది. సంక్షేమ పథకాల ద్వారా ఏటా వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా పోని పేదరికం పి4 విధానంతో పోతుందనేది నేతి బీరకాయ చందమని జనం చర్చించుకుంటున్నారు. పోనీ ఈ పి-4 విధానంలో ఉద్యోగాలు, ఉపాధి కల్పనకు సంబంధించిన అంశాలు ఉన్నాయనుకుంటే అదీ



లేదు. పేదరికం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో, వెనుకబడిన ప్రాంతాల్లో కార్పొరేట్ కంపెనీలతో ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతంలో ఉన్న యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఒక్కో పేద కుటుంబానికి చెందిన ఒక వ్యక్తికి ఉద్యోగం లేదా ఉపాధి కల్పించడం ద్వారా ఆ కుటుంబాన్ని క్రమేణా పేదరికం నుంచి బయటకు తీసుకుని రావచ్చుననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలో ఉన్న పరిశ్రమలు మూతపడగా, ఒక్క కొత్త పరిశ్రమ ఏర్పాటు కాలేదు. దీంతో వేలాది మంది కార్మికులు ఉపాధి కోసం వలసలు వెళ్లిపోగా, మరికొంతమంది హోటళ్లలోనూ, అపార్టుమెంట్ల వద్ద సెక్యూరిటీ గార్డుగానూ చాలీచాలని వేతనాలతో పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. పి-4లో ఉపాధి, ఉద్యోగ కల్పన దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. కానీ సంక్షేమ పథకాల అమలు ద్వారా నగదు బదిలీ చేసినట్లు గానే పి-4 విధానంలో కూడా మార్గదర్శులతో ఆర్థిక సాయం చేయడం వల్ల చేకూరే ప్రయోజనం ఏమీ వుండకపోవచ్చునని భావిస్తున్నారు. ఈ విధానం అమలులో భాగంగా కొంతమంది అధికారులు, ఉద్యోగులు మార్గదర్శులు కావాలని ఒత్తిడి చేయడం వల్ల ఫలితం వికటించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈనెల 15 నాటికి పి4 విధానంలో భాగంగా ఎంపిక చేసిన బంగారు కుటుంబాలకు మార్గదర్శకులచే సాయం చేయించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకెళ్తోంది. మన్యం జిల్లాలో 33,309 కుటుంబాలను ఎంపిక చేయాలని నిర్ణయించగా, ఇప్పటి వరకు కేవలం 13వేల కుటుంబాలను మాత్రం ఎంపి చేశారు. ఎంపికైన బంగారు కుటుంబాలలో సగం మందికి కూడా మార్గదర్శులు దొరకని పరిస్థితి కనిపిస్తోంది. ఇంతవరకు ప్రభుత్వాలు పేదరిక నిర్మూలన కోసం చేపడుతున్న సంక్షేమ పథకాల అమలు ద్వారా చేకూరని ప్రయోజనం పి4 విధానం అమలుతో వస్తుందని ఆశించడం అత్యాశే అవుతుంది.

వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

ఒడిశా నుంచి కేరళకు గంజాయి

గొల్జాం కూడలిలో పట్టుకున్న పోలీసులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఒడిశా నుంచి కేరళకు బొలెరో వాహనంలో తరలిస్తున్న గంజాయిని లక్కవరపుకోట మండలం గొల్జాం జంక్షన్ వద్ద పట్టుకున్నట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఎల్.కోట పోలీసులకు వచ్చిన కచ్చితమైన సమాచారంతో శుక్రవారం గొల్జాం జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఒడిశా నుంచి కేరళ రాష్ట్రానికి బొలెరో వాహనంలో గంజాయిని తరలిస్తున్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొన్నారు. వారి వద్ద నుంచి 71 ప్యాకెట్లలో 145 కిలోల గంజాయి, బొలెరో వాహనం సీజ్ చేశారు. పట్టుబడిన నిందితుల్లో ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా పదువ మండలం కుదుబ్ గ్రామానికి చెందిన డంబు శిరగం, కేరళ రాష్ట్రం ఖసర్గాడ్ మంజెవరం మండలం హెరీసంగలి గ్రామానికి చెందిన మొహమ్మద్ షఫీక్ ఉన్నారు. ఈ కేసులో మరో నిందితుడు హెరీసంగలి గ్రామానికి చెందిన అబుబాకర్ సిద్ధికిని త్వరలో పట్టుకుంటామని ఎస్‌పి తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని చెప్పారు. నిందితులను అరెస్టు, గంజాయి సీజ్ చేయడంలో క్రియాశీలకంగా పని చేసిన ఎస్.కోట రూరల్ సిఐ ఎల్.అప్పల నాయుడు, ఎల్.కోట ఎస్‌ఐ నవీన్ పడాల్, ఇతర పోలీసు సిబ్బందిని ఎస్‌పి అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి- రాజాం

సెప్టెంబర్ 13వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజాం సీనియర్ సివిల్ జడ్జి కె. శారదాంబ అన్నారు. శనివారం రాజాం కోర్ట్ ఆవరణంలో సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్ హాల్ పోలీస్, రెవెన్యూ, బ్యాంకు అధికారులు, చిట్ ఫండ్ కంపెనీ, బ్యాంకు న్యాయవాదులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు లోక్ అదాలతో రాజీకి అనుకూలమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు, ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కక్షదారులు వినియోగించు కోవాలని కోరారు. రాజీయే రాజమార్గమని, రాజికీ వీలైన ఎక్కువ కేసుల్లో లోక్ అదాలతో పరిష్కరించుకోవాలని 'లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు' అని తెలిపారు. లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు కూడా వాపస్ ఇస్తామన్నారు. ఈ సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి కె నైమీషా, బార్ అసోసియేషన్ సెక్రటరీ బి.తిరుపతి నాయుడు, ప్రభుత్వ న్యాయవాది పి.శ్రీనివాసు, ఎజిపి ఎస్ పోలారావు, ఆర్ విజయ కుమార్, ఐ.శ్రీరాములునాయుడు, ఆర్ఇసిహెచ్ జయదేవ్, పట్టణ ఎస్ఐ కే శేఖర్‌రావు, రాజాం ఎక్సైజ్ ఎస్సై మాన్యాలు, ఎల్ల మహేశ్వ రరావు, రెండు మండలాల డిప్యూటీ తహశీల్దార్, బ్యాంకులు, మున్సిపాలిటీ సౌండింగ్ కౌన్సిల్, మూడు మండల పోలీస్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి- డెంకాడ(భోగాపురం)

భోగాపురం మండలంలోని సవరవల్లి పంచాయతీలో ఎస్‌సి కాలనీ శ్మశానవాటికలో మండల పరిషత్ నిధులతో శనివారం నూతనంగా బోరు ఏర్పాటుకు సర్పంచ్ ఉప్పాడ విజయభాస్కర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పట్నా తాతయ్యలు, మాజీ సర్పంచ్ పూసర్ల వెంకటరమణ, కొచేర్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ చొరవతో స్తంభాలు ఏర్పాటు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలోని 7వ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ చొరవతో విద్యుత్ స్తంభాలను శనివారం ఏర్పాటు చేశారు. 7వ వార్డులో గత నాలుగు సంవత్సరాలు బట్టి కరెంటు స్తంభాలు విరిగిపోయి ఉన్నాయి. ఈ నేపథ్యంలో కౌన్సిలర్ ప్రసాద్ ఆధ్వర్యంలో కొత్తగా కరెంటు పోల్ మార్చి కరెంట్ లైన్లు మార్పు చేశారు. వార్డు సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి కృషి చేస్తానని కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ అన్నారు.

ఎన్‌కెఆర్‌పురంలో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని నీలకంఠరాజపురం గ్రామంలో శనివారం ఉచిత పశుఆరోగ్య, గర్భ కోశ వ్యాధుల చికిత్సా శిబిరం వేపాడ పశువైద్యాధికారి డాక్టర్ కోరాడ గాయత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. పశువులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో రైతులకు పశువులు ఈనిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జున్ను పాలను అప్పుడే పుట్టిన పెయ్యలకు, దూడలకు పట్టడం వల్ల కలిగే లాభాలు, వర్షాకాలంలో పశువులు, జీవాల యాజమాన్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశుగ్రాస పెంపకం వల్ల కలిగే లాభాలు మీద అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో వేపాడ పశువైద్య సిబ్బంది, గోపాలమిత్ర బోజింకి సింహాద్రిప్పడు, పశుసంవర్ధక సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అసెస్‌మెంట్ బుక్స్ ఎంఇఒ ఎం.వరప్రసాదరావు, ఎరకయ్య శనివారం పంపిణీ చేశారు. మండలంలోని 79 పాఠశాలకు 18,228 మంది విద్యార్థులకు అసెస్‌మెంట్ బుక్స్ ఇచ్చెలా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశించినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి ఈ పుస్తకాలు అందజేసేలా చూడాలన్నారు.

జెవివి ఆధ్వర్యంలో సెమినార్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వక్తను సత్కరిస్తున్న సీతం ప్రతినిధులు

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు సెప్టెంబర్‌లో జరుగుతున్న నేపథ్యంలో అనేక అంశాల మీద జిల్లాలో విస్తృతంగా సెమినార్లు, సభలు శనివారం జరిగాయి.. ఇందులో భాగంగా ఎంవిజిఆర్, లెండి, సీతంలలో సెమినార్లు నిర్వహించారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్- ఉద్యోగ, విద్యా రంగం, సమాజం పై దాని ప్రభావాలు అనే అంశం మీద సెమినార్లు నిర్వహించారు. దీని మీద కెఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కోగంటి శ్రీపత్‌రాయ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎఐని విద్యార్థులు ఎలా ఉపయోగించుకోవాలి, మితిమీరిన వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు ఏంటి? కొన్ని సంస్థలు ఆధిపత్యంతో ఎఐని ఎలా తమ అదుపులో ఉంచుకొన్నది తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి ప్రభాత్ మహాసభల విజయవంతం చేయాలనీ పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు ఎడ్ల గోవిందరావు కళాశాలల సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల కోనేరు ఆక్రమణ

ప్రజాశక్తి - వేపాడ

వేపాడ మండల కేంద్రంలో పశువులు కోనేరు ఆక్రమణకు గురవుతుంది. కోనేరు చుట్టూ ఉన్న ఖాళీ స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకొని ఎటువంటి అనుమతులూ లేకుండా ఇల్లు నిర్మించుకుంటున్నా రెవెన్యూ, పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తుడు గొర్లె శ్రీను ఆరోపించారు. రెవెన్యూ అధికారులను అడిగితే పంచాయతీ పరిధిలో ఉందని, పంచాయతీ అధికారులను అడితే రెవెన్యూ పరిధిలో ఉంది ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్నారే తప్ప ఆక్రమణలను అడ్డుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పశువుల కోనేరు చుట్టూ ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శ్రీను కోరుతున్నారు.

కొత్తరేగ పిఎసిఎస్ చైర్మన్ ఆకస్మిక మృతి

ప్రజాశక్తి - రామభద్రపురం

కొత్తరేగ పిఎసిఎస్ చైర్మన్ రెడ్డి పారన్నాయుడు శుక్రవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందగా శనివారం స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన వీరి పార్థివ దేహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి విధేయుడిగా ఉంటూ నిత్యం గ్రామాభివృద్ధి శ్రమించే వ్యక్తి ఇలా ఆకస్మికంగా మృతి చెందడం పార్టీకి గ్రామ ప్రజలకు, కుటుంబ సభ్యులుకు తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. ఆయన వెంట టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతి రావు, స్థానిక నాయకులు, ఉన్నారు.

అవయవ దానంపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

అవయవ దానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ బి.దేవి మాధవి సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. డిప్యూటీ సూపరింటెండెంట్లు ఎం.శ్రీధర్, పి.రమణి మాట్లాడుతూ బ్రెయిన్ డెడ్ అయిన పేషెంట్ కుటుంబ సభ్యులకు, బంధువులకు అవయవదానం ప్రాముఖ్యత గురించి వివరించి, అవయవదానం చేసేటట్లుగా ప్రోత్సహించాలని చెప్పారు. అనంతరం ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ, మానవహారం చేపట్టారు. అందులో సుమారు 50 మంది అవయవదాన ప్రతిజ్ఞ చేశారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి- బాడంగి

వాడాడ గ్రామానికి చెందిన ఎల్. అలేఖ్య (15) కనిపించడం లేదని పోలీసులకు తల్లి పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తారకేశ్వరావు తెలిపారు. జులై 29వ తేదిన ఊరిలో ఉన్న తన స్నేహితులు దగ్గరికి వెళ్లి వస్తానని చెప్పి ఇంత వరకూ రాలేదని, తన స్నేహితులు బంధువులు ఇల్లు వద్ద ఆరా తీయగా ఎటువంటి ఫలితం రాకపోవడంతో పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారని ఎస్ఐ తెలిపారు ఆచూకీ తెలిసిన వాళ్ళు బాడంగి పోలీస్ స్టేషన్‌కి 9121109455 సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

హుండీ చోరీ

ప్రజాశక్తి- సంతకవిటి

మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలోని శుక్రవారం అర్ధరాత్రి హుండీ చోరీకి గురైంది. శనివారం ఉదయం పూజలు నిర్వహించడానికి వచ్చిన ఆలయ ప్రధాన అర్చకులు జడా నేతాజీ స్వామి వారి ఆలయం తాళం పగలు గొట్టినట్టి ఉండటాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుండీలోని సుమారు వెయ్యి రూపాయలు వరకు ఉండేవన్నారు. అనంతరం హుండీని వెతకగా సమీపంలో వున్న చెరువులోని గుర్తు తెలియని వ్యక్తులు నగదు తీసివేసి, హుండీని పడేసినట్లు ప్రధాన అర్చకులు గుర్తించారు.

జిందాల్ నిర్వాసితులకు అండగా ఉంటాం

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, బాధితులు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జిందాల్ బాధితులు బతుకు కోసం, ఉపాధి కోసం, భవిష్యత్ కోసం భూములు ఇచ్చి ఇప్పుడు తమని ఆదుకోవాలని 44 రోజులుగా ఆందోళన చేస్తుంటే ఆదుకోవాల్సిన ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు జిందాల్‌కు కొమ్ము కాయడం సిగ్గు చేటు అని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని బొడ్డవర వద్ద జిందాల్ నిర్వాసితుల శిబిరం వద్ద తమ్మినేని మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా లేనివిధంగా పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 పేరుతో నిర్వాసితులను బెదిరించడం దారుణమన్నారు. జిందాల్ కంపెనీ పెడితే బతుకులు బాగుపడతాయని నమ్మి భూములు ఇస్తే కంపెనీ పెట్టకపోగా భూములిచ్చిన రైతులను కూలీలుగా మార్చి, వారి త్యాగాలతో ఇచ్చిన భూమిని రియల్ ఎస్టేట్‌కు అమ్ముకోవడం అంగీకరించబోమని హెచ్చరించారు. చట్టబద్ధంగా వారి భూమి వారికి ఇచ్చే వరకూ మొత్తం ప్రజా సంఘాలను కూడగట్టి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. జిందాల్ చుట్టూ ఉన్న ప్రాంతం పోలీస్ పహారాలో జిందాల్ కనుసన్నల్లో నడుస్తుందన్నారు. కొందరు నాయకులు జిందాల్ కార్యాలయం వద్ద నిర్వహించ తలపెట్టిన డూప్లికేట్ ఉద్యమం మూడు రోజులకే నీరిగారిపోయిందంటే ఆ ఉద్యమంలో నిజాయితీ లేకపోవడమే కారణమన్నారు. భూమిపోయిన నిర్వాసితులు చేస్తున్న ఉద్యమం రోజురోజుకి ఉధృతం అవుతుందంటే ఆ పోరాటంలో న్యాయం ఉందన్నారు. ఆరోజు తానే భూములు ఇవ్వమన్నానని అందుకే నిర్వాసితులకు అండగా దేనికైనా పోరాడుతాను అని రఘురాజు అన్నదాంట్లో నిజాయితీ కనిపిస్తుందన్నారు. న్యాయబద్ధంగా నిజాయితీగా చేస్తున్న అన్ని ఉద్యమాల్లో సిపిఎం పార్టీ దిగబడి ముందుండి పోరాడేందుకు సిద్ధంగా ఉంటామన్నారు. 18 ఏళ్లుగా భూమికి దూరమై అందుమూలంగా ఆహార ధాన్యాలకు దూరమై, ఉద్యోగం లేక ఉపాధి లేక మరింత నిరుపేదలుగా మారిన నిర్వాసితులను పట్టించుకోవడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు, సామాజిక కార్యకర్త మద్ది కృష్ణ, జిందాల్ భూములు కోల్పోయిన బాధితులు తదితరులు పాల్గొన్నారు.


యాప్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్

టుడే నీడ్స్ మొబైల్ యాప్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం

టుడే నీడ్స్ మొబైల్ యాప్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు శనివారం ఆవిష్కరించారు. టుడే నీడ్స్ మొబైల్ యాప్‌లో ఆర్డర్ చేస్తే క్షణాల్లో నిత్యావసర వస్తువులను ఇళ్లకే చేరుస్తామని నిర్వాహకులు ఈశ్వర్ చంద్రకాంత్ తెలిపారు.

ఎంఎస్ఎంఇ పార్కు నిర్మిస్తే ప్రతిఘటిస్తాం: ఎమ్మెల్సీ

గిరిజనులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

ప్రజాశక్తి - రామభద్రపురం

దశాబ్దాల కాలంగా గిరిజనుల సాగులో ఉన్న భూములు లాక్కొని ఎంఎస్ఎంఇ పార్కు నిర్మిస్తే ప్రతిఘటిస్తామని, కాకర్లవలస, కారేడువలస గ్రామాల గిరిజనుల భూ పోరాటానికి అండగా నిలుస్తామని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. ఇక్కడ గిరిజన రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని తెలుసుకొని స్వయంగా రైతులను కలిసేందుకు వచ్చానని శనివారం ఆయా గ్రామాల రైతులతో కలిసి పార్కు నిర్మాణం కోసం స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నం చేస్తున్న స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా గిరిజన, హరిజన రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. అభివృద్ధి పేరుతో కేవలం గిరిజన హరిజన రైతుల భూములు మాత్రమే లాక్కుంటున్నారన్నారు. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయిన గిరిజనులు మాత్రం ఎక్కడ చూసినా అన్యాయాన్ని గురవ్వడం తీవ్రంగా కలచి వేస్తుందని వాపోయారు. ఈ అమాయక గిరిజన ప్రజల తరపున న్యాయం జరిగే వరకు పోరాడతానని ప్రకటించారు. 2017లో ఇక్కడ భూములు కొనుగోలు చేసిన ఎపిఐఐసి భూములు ఇప్పటివరకు అభివృద్ధి చేయకపోవడం వల్ల 2013 భూసేకరణ చట్టం అనుసరించి తిరిగి గిరిజనులకి భూములు అప్పజెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మజ్జి రాంబాబు, గ్రామ పెద్దలు, బాధిత గిరిజన రైతు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆ భూములపై గిరిజనులకు హక్కు లేదు: తహశీల్దార్

మండల పరిధిలోని కాకర్లవలస, కారేడువలస సమీపంలో 2017లో ఎపిఐఐసికి కేటాయించిన భూముల్లో గిరిజనులకు ఎటువంటి హక్కులు లేవని తహశీల్దార్ అజు రఫీ జాన్ స్పష్టం చేశారు. మండల రెవెన్యూ కార్యాలయంలో శనివారం ఫారెస్టు, పోలీసు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. 717 సర్వే నెంబర్లో ఎపిఐఐసికి 187 ఎకరాలు కేటాయించామని, దీనికి సంబంధించి ప్రభుత్వానికి వారు సుమారు రూ.7కోట్లు చెల్లించారని తెలిపారు. ఈ భూముల్లో తాము సాగుచేసుకుంటు న్నామని గిరిజనులు అనడం సబబుకాదని తెలిపారు. ఈ ప్రాంతంలో కాకర్లవలస, కారేడువలస గిరిజనులకు 2020-21లో సాలూరు ఈస్టు బీట్ ఫారెస్టు ప్రాంతంలో సుమారు 28 మందికి ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చామని, అయితే ఆ భూములను సాగుచేయకుండా ఎపిఐఐసికి కేటాయించిన భూములను స్వాధీనం చేసుకోవడం చట్ట విరుద్ధమని తెలిపారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు కలిగినవారందరికి సోమవారం ఫారెస్టు, రెవెన్యూ అధికారులు జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసి ఆ భూములు అప్పగించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ మహేంద్ర, ఎస్ఐ వెలమల ప్రసాదరావు, సాలూరు ఈస్ట్ బీట్ గార్డు శ్రీనివాస్, మండల సర్వేయర్ వంగపండు సాయికుమార్, సర్వేయర్లు, విఆర్వోలు పాల్గొన్నారు.

పుట్టినబిడ్డకు ముర్రుపాలు తాగించాలి

ప్రజాశక్తి- గంట్యాడ

బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి దగ్గర ఉన్న ముర్రి పాలను తప్పనిసరిగా పట్టించాలని ఐసిడిఎస్ పిఒ ఉమా భారతి అన్నారు. శనివారం కె.వెలగాడ, మదనాపురం గ్రామాల్లోని అంగనవాడీ కేంద్రాలలో శనివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలును ఆరు నెలల వరకు పట్టించాలన్నారు. ఆసుపత్రులోని డెలివరీ అయిన ఇంటి వద్ద నార్మల్ డెలివరీ అయినా పుట్టిన గంటలోపు తల్లిపాలు ను పట్టించాలన్నారు. అనంతరం 8 నెలలు గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సెక్టార్ సూపర్‌వైజర్లు కృష్ణవేణి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని ఎన్‌కెఆర్‌పురం, వేపాడ, బొద్దాం ఐసిడిఎస్ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాలు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తల్లిపాలు వల్ల బిడ్డలకు కలిగే ప్రయోజనాలు గూర్చి పిల్లలు తల్లులకు వివరించారు. కార్యక్రమంలో ఆయా కేంద్రాల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గజపతినగరం రూరల్: తల్లిపాలు బిడ్డకు సంజీవని అని సర్పంచ్ లెంక పద్మావతి అన్నారు. శనివారం మండలంలోని పాతబగ్గాం అంగన్వాడి కేంద్రంలో ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు గ్రామ సర్పంచ్ పద్మావతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన గంటలోపే బిడ్డకు ముర్రిపాలు ఇవ్వాలని ముర్రిపాలు బిడ్డకు మొదట టీకాల పనిచేస్తుందని అని అన్నారు. ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే బిడ్డకు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శకుంతల అంగన్వాడీ కార్యకర్తలు ఎస్. కనకదుర్గ, ఎస్. శారద పాల్గొన్నారు.

బొబ్బిలి: బిడ్డకు జన్మనిచ్చిన 30 నిమిషాలు లోపు ముర్రుపాలు తాగిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసిడిఎస్ సూపర్ వైజర్లు రమా, రాజు అన్నారు. పట్టణంలోని 14, 16, 18 వార్డులలో శనివారం తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు తప్పనిసరిగా తల్లిపాలు తాగించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

తెర్లాం: తెర్లాం, పెరుమాలి సెక్టార్లో శనివారం తల్లిపాలు వారోత్సవాలను నిర్వహించారు. ఐసిడిఎస్‌పిఒ ఎం.వరహాలమ్మ, ఎంపిపి ఎం.ఉమాలక్ష్మి హాజరై మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ అపర్ణ, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

ఘనంగా బళ్లారి రాఘవ జయంతి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం బళ్లారి రాఘవ జయంతిని ఘనంగా నిర్వహించారు. రాఘవ చిత్రపటానికి డిఆర్ఒ శ్రీనివాసమూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉన్నత విద్యను అభ్యసించిన బళ్లారి రాఘవ లాయర్ వృత్తిని చేపట్టి నాటకరంగం మీద మక్కువతో తాను సంపాదించినదంతా యావత్తు నాటకరంగ పురోగతికి త్యాగం చేశారని డిఆర్ఒ అన్నారు. నాటక రంగంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన బళ్లారి రాఘవకు అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం రావుబహదూర్ బిరుదును ప్రదానం చేసిందని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ ఎఎంఎస్ కళావతి, జిల్లా పర్యాటక అధికారి కె.కుమారస్వామి, జిల్లా కోఆపరేటివ్ అధికారి రమేష్, వయోజన విద్య ఉపసంచాలకులు సుబ్రహ్మణ్యవర్మ, కలెక్టరేట్ ఎఒ గోవింద్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు శాఖ ఆధ్వర్యాన.. జిల్లా పోలీసు కార్యాలయంలో బళ్లారి రాఘవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాఘవ చిత్రపటానికి ఎఎస్‌పి సౌమ్యలత పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ బి.సుధాకర్, ఆర్ఎస్ఐ ఎన్.గోపాలనాయుడు, ఎఒ పి.శ్రీనివాసరావు, ఆఫీసు పర్యవేక్షకులు టి.రామకృష్ణ, వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : నగరపాలక సంస్థ కార్యాలయంలో బళ్లారి రాఘవ చిత్రపటానికి కమిషనర్ పల్లి నల్లనయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, టిపిఆర్ఒ సింహాచలం, మున్సిపల్ అసోసియేషన్ అధ్యక్షులు నర్సింగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదరణ చూసి ఓర్వలేకే అడ్డగింత

ప్రజాశక్తి - బొబ్బిలి

రాష్ట్రంలో వైసిపికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే కూటమి ప్రభుత్వం జగన్ పర్యటనకు వస్తున్న జనాలను అడ్డుకుంటుందని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ మాజీమంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిని, మాజీ మంత్రి ప్రసన్న కుమార్ రెడ్డిని పరామర్శించేందుకు వెళ్లిన జగన్ వద్దకు జనాలు రాకుండా పోలీసులతో అడ్డుకునేందుకు ప్రయత్నించినా జనాలు ఎదిరించి వచ్చారని చెప్పారు. జగన్ పర్యటనకు జనం రాకుండా రోడ్డును తవ్వడం సరికాదన్నారు. పెట్టుబడులు కోసం సింగపూర్ పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబు, ఐటి శాఖ మంత్రి లోకేష్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ రాష్ట్రానికి ఎంత పెట్టుబడులు తెచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. ఒక పారిశ్రామిక వేత్త కూడా పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రాలేదని విమర్శించారు. ఆయనతో వైసిపి సీనియర్ నాయకులు శంబంగి వేణుగోపాల్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, మండల అధ్యక్షులు రెడ్డి దామోదర్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

ప్రజాశక్తి - బొబ్బిలి

వాహన నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ హెచ్చరించారు. సిఐ ఆదేశాలు మేరకు ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞానప్రసాద్ శనివారం బొబ్బిలి పట్టణంలో వాహనాలను తనిఖీ చేసి కేసులు నమోదు చేశారు. మైనర్ డ్రైవింగ్ చేస్తున్న వారికి పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులు, తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్ 7, ట్రిపుల్ డ్రైవింగ్ 4, మైనర్ల డ్రైవింగ్ 6, నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై 2 కేసులు నమోదు చేశారు. వాహన నిబంధనలు పాటించా లని సూచించారు.

రేగిడి: రహదారి భద్రతను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ పొట్నూరు నీలావతి తెలిపారు. శనివారం రేగిడి పోలీస్ స్టేషన్ నుండి ఉంగరాడ మెట్ట వరకు రోడ్డు భద్రతలో భాగంగా ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, గురుకుల పాఠశాల విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాలు నడిపినప్పుడు అతివేగం పనికిరాదన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. వీరితో ఎంఇఒ వరప్రసాదరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఏసి సూర్యారావు ఉన్నారు.

ఎరువులు అందించాలని సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి - తెర్లాం

రైతులకు ఎరువులను అధికారులు సకాలంలో అందించడంలేదని పలువురు సభ్యులు వ్యవసాయాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం మండలం సర్వసభ్య సమావేశం ఎంపిపి ఎం.ఉమాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యా రంగం, విద్యుత్తు, నీటిపారుదల రంగాలపై తొలుత చర్చించారు. సంబంధిత అధికారులు స్పందించి వారి నిర్వహించిన కార్యక్రమాలను సభకు వివరించారు. వ్యవసాయ రంగంపై చర్చ వచ్చినపుడు పలువురు సభ్యులు మండలంలో ఎరువులు కొరత అధికంగా ఉందని రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రశ్నించారు. ఇలా అయితే రైతులు ఆత్మహత్యలు ఎందుకు చేసుకోరని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ ఆర్.రాంబాబు, వైస్ ఎంపిపి సత్యనారాయణ, జెడ్‌పిటిసి లూర్తు, అన్ని శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

జిల్లాలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలు శనివారం అన్నదాత సుఖీభవ- పిఎం కిషాన్ పథకానికి సంబంధించిన చెక్కులను రైతులకు అందించారు. రాజాంలోని ఎమ్మెల్యే కోండ్రు మురళి, బొబ్బిలిలో ఎమ్మెల్యే బేబినాయన, బుడా ఛైర్మన్ తెంటు రాజా, నెల్లిమర్ల నియోజకవర్గంలోని డెంకాడ మండలంలోని ఎమ్మెల్యే లోకం నాగమాధవి చెక్కులను అందించిన తరువాత మహిళలతో కలిసి వరి నాట్లు వేశారు.. విజయనగరంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు రైతులకు చెక్కులను అందించారు.


బొబ్బిలి: చెక్కును రైతులకు అందిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన


చీపురుపల్లి: రైతులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

డెంకాడ: వరినాట్లు వేస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

రాజాం: యంత్ర పరికరం గురించి అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే

విజయనగరం: రైతులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే అతిథి

మాస్టారు సేవలు 'బంగారం'

ప్రజాశక్తి- నెల్లిమర్ల

పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న బంగారయ్య

మండలంలోని జరజాపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న శివుకు బంగారయ్య మాస్టారు ఉపాధ్యాయ వృత్తి చేస్తూనే మరో పక్క పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ నిరంతరం విద్యార్థుల శ్రేయస్సు కోసం పరిశ్రమిస్తూ పలువురు మన్ననలు పొందుతున్నారు. గంట్యాడ మండలంలోని కొత్తవెలగాడ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన శివుకు సన్యాసప్పుడు, అచ్చమ్మ దంపతులకు మూడవ సంతానంగా జన్మించిన బంగారయ్య 10వ తరగతి వరకు పెదమజ్జిపాలెం హాస్టల్‌లో ఉండి అక్కడే హైస్కూల్లో చదువుతూ పది పూర్తి చేసి, తర్వాత ఇంటర్, డిగ్రీలను విజయనగరం ఎంఆర్ కాలేజీలో, ఆంధ్ర యూనివర్సిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. యూనివర్సిటీ నుంచి 1998లో డిఎస్‌సి ద్వారా ఎస్‌జిటిగా సెలెక్ట్ అయి ఎస్.కోట మండలం, సిరికివానిపాలెంలో ఉద్యోగ జీవితం ప్రారంభించి, అదే మండలం కొత్త అడ్డతీగ పాఠశాలలో కొంతకాలం పనిచేసి విద్యార్థులను, పాఠశాలను ఉన్నత స్థితిలో తీర్చిదిద్ది గ్రామస్తుల మన్ననలు పొందారు. అక్కడ నుండి పదోన్నతి ద్వారా కొట్టాం, లక్కవరపుకోట పాఠశాలలో పనిచేసి, 2017లో జరిగిన బదిలీలో తంగుడుబిల్లి ఉన్నత పాఠశాలలో జాయిన్ అయ్యి విద్యార్దులు, తల్లిదండ్రులు, గ్రామస్తుల మనస్సుల్లో చెరగని ముద్ర వేశారనడంలో అతిశయోక్తి లేదనే చప్పాలి. ఆయన ఉపాధ్యాయ వృత్తి జీవితం ప్రారంభించి 26 సంవత్సరాలుగా నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తూ విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఎనలేని కృషి చేస్తున్నారు. ఇటీవల విజయనగరం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ చేతుల మీదగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఆయన ఎక్కడ పనిచేస్తే అక్కడ ఉత్తమ విద్యార్థులకు తన సొంత డబ్బులతో ప్రోత్సహకాలు అందిస్తుంటారు. అనాథ విద్యార్థులను ప్రోత్సహించడం, వారికి సహాయం చేయడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. తన స్వగ్రామంలో హరిజన కాలనీలో గల నిరుపేద వృద్ధ మహిళలకు ఏటేటా తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం చీరల పంపిణీ కార్యక్రమం చేస్తుండడం బంగారయ్య మానవతా ధృక్పథానికి అద్దం పడుతుంది. గ్రామంలో ఆలయాల అభివృద్ధికి రూ.30వేలు వరకు ఆర్థిక సాయం అందించారు. మండు వేసవిలో ఉపాధి హామి వేతనదారులకు చల్లని మజ్జిగ పంపిణి చేయడం, తలసేమియ భాధితులకు రక్తదానం చేయడం, మనిషి మరణించిన తరువాత అవయవ దానం చేయడం, సిఎం చంద్రబాబు పిలుపుతో పి4లో భాగంగా నిరుపేద కుటుంబాన్ని బంగారు కుటుంబంగా దత్తత తీసుకోవడం ఇలా నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. బంగారయ్య వృత్తిపరంగా విద్యార్థులను గణితంలో ఉన్నతంగా తీర్చిదిద్దుతూ, అనుకున్న లక్ష్యాలను సాధిస్తూ విద్యార్థుల శత శాతం ఉత్తీర్ణతకు రాత్రులు కూడా గ్రామాల్లో పర్యటిస్తూ తల్లిదండ్రులతో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు విద్యార్థుల ప్రగతికి పాటుపడుతున్నారు. బంగారయ్య చేస్తున్న పలు సేవా కార్యక్రమాలను గుర్తించి పలు స్వచ్ఛంద సేవా సంస్థలు అనేక అవార్డులను ఇచ్చి సత్కరించడంతో ఆయన మరింత ఉత్సాహంతో ఇటు వృత్తిలోనూ అటు ప్రవృత్తిలోనూ దూసుకుపోతున్నారు.